నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
## కర్నూలు | నంద్యాల
మంగళవారం | 03 డిసెంబరు 2024 పేజీలు 8

### వాలంటరీలను కూటమి ప్రభుత్వం
# నమ్మించి మోసం చేసింది



ధర్నా నిర్వహిస్తున్న వాలంటీర్లు

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్:** ఎన్నికల ముందు వాలంటరీలకు అనేక హామీలు ఇచ్చి వాలంటరీలను నమ్మించి మోసం చేసిందని ఏపీ గ్రామ, వార్డు సచివాలయాల వాలంటరీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హుమ్మాయూన్‌బాష అన్నారు. సోమవారం వాలంటరీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ కలెక్టర్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన

మిగతా 2లో

### ప్రజా సమస్యలను
# సానుభూతితో పరిష్కరించండి



ప్రజల అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ రాజకుమారి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్వీకరించిన ఫిర్యాదులను పరిష్కరించడంలో అలసత్వం వహిస్తున్నారని ఇష్టానుసారంగా రెడ్రెస్ చేయకుండా సానుభూతితో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. సోమవారం వైయస్సార్ సెంటినరీ హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో డీఆర్వో రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులతో కలిసి అర్జీలను స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కొంతమంది జిల్లా, మండలస్థాయి అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నారని రాష్ట్ర సీఎం కార్యాలయం నుంచి స్వయంగా సమీక్షిస్తున్నప్పటికీ సీరియస్‌గా తీసుకోకుండా ఎండార్స్‌మెంట్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన రీతిలో ఎండార్స్‌మెంట్ ఇవ్వకపోతే ఉపేక్షించేది లేదని తెలిపారు. జిల్లాలో భూ సమస్యలు అధికంగా ఉన్నాయని వాటి పరిష్కారంలో ప్రజలకు రెవెన్యూ వ్యవస్థపై నమ్మకం కలిగేలా పనులు చేయాలన్నారు. రెవెన్యూలో కీలకపాత్ర పోషించే వీఆర్వోలు అవినీతికి పాల్పడుతున్నట్లు పలు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో

మిగతా 2లో

**కర్నూలు, మేజర్‌న్యూస్ ప్రతినిధి:** అర్జీల పరిష్కారంలో నాణ్యత ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. పీజీఆర్ఎస్‌కు సంబంధించి అర్జీలను ఇంకా మెరుగ్గా పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. అర్జీలు ఏ విధంగా పరిష్కారమవుతున్నాయని లోటుపాట్లపై రాష్ట్రస్థాయిలో విశ్లేషణ చేశారన్నారు. రెవెన్యూలో ఎక్కువ శాతం రీఓపెనింగ్ జరుగుతున్నాయని విశ్లేషించారన్నారు. పోలీసు శాఖకు సంబంధించి ప్రాపర్టీ, క్రిమినల్ కేసుల పరిష్కారం చాలా ఆలస్యం అవుతుందన్నారు. అర్జీల పరిష్కారంలో నాణ్యత ఉండటం లేదని, పరిష్కారం తీరును అడిట్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వచ్చే వారంలో ప్రతి కేసును రివ్యూ చేయడం జరుగుతుందన్నారు.

మిగతా 2లో

### అర్జీల పరిష్కారంలో
# నాణ్యత ఉండాలి..



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాష

### ప్రజా సమస్యల పరిష్కార వేదికకు
# గైర్హాజరైన అధికారులు

**చాగలమర్రి, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన చాగలమర్రిలో సోమవారం తహాశీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా వేదికకు మండల అధికారులందరూ పాల్గొనవలసి ఉండగా ఐసిడిఎస్ సూపర్వైజర్ సుశీలమ్మ మాత్రమే హాజరు కావడం గమనార్హం. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం తహాశీల్దారు కార్యాలయంలో అన్ని శాఖలకు చెందిన ప్రభుత్వ అధికారులతో

మిగతా 2లో



ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అధికారులు హాజరు కాని దృశ్యం

# శ్రీశైల పుణ్యక్షేత్రంలో భక్తుల రద్దీ



స్వామి అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైల మహా క్షేత్రంలో స్వామి,అమ్మవార్ల దర్శనం కొరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్తీక మాసం ముగయటంతో తాత్కాలికంగా నిలువ వేసిన ఆర్జిత సేవలు పునః ప్రారంభామయ్యాయి. దీంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సోమవారం మల్లికార్జున స్వామి వారికి ప్రీతికరమైన రోజు కావడంతో తెల్లవారు జాము నుండే భక్తులు పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి,స్వామి,అమ్మవార్ల దర్శనార్థమే ఆలయ క్యూలైన్లలో బారులు తీరారు. ఆలయ ఉచిత, శీఘ్ర,అతి శీఘ్ర క్యూలైన్ లన్నీ భక్తులతో కిక్కిరిస్తాయి. స్వామివారికి సామూహిక

మిగతా 2లో

# శ్రీశైల పుణ్యక్షేత్రంలో భక్తుల రద్దీ

(మొదటి పేజి తరువాయి)



అభిషేకాలు,అమ్మ వారికి కుంకుమార్చన వంటి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

**భక్తులను అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు :** శ్రీశైల దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరిస్తున్నాయి. నిత్యకళారాధన వద్ద సోమవారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

## వాలంటరీలను కూటమి ప్రభుత్వం నమ్మించి మోసం చేసింది

(మొదటి పేజి తరువాయి)

మాట్లాడుతూ ఎన్నికల ముందు వాలంటరీలకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని, రూ.10వేల వేతనం ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక వాలంటరీలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ప్రజలకు చేసిన వాలంటరీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని జిల్లా అధ్యక్షుడు నూర్‌బాష మండిపడ్డారు. వాలంటరీల ఆత్మహత్యలకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌లే బాధ్యులు అవుతారన్నారు. అంతకుముందు అంబేద్కర్ భవన్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు.

# అర్జీల పరిష్కారంలో నాణ్యత ఉండాలి

(మొదటి పేజి తరువాయి)

సీఎంఓ గ్రీవెన్స్‌లకు సంబంధించి ఇంకా 18పెండింగ్‌లో ఉన్నాయని, వాటి మీద ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారం చేయాలని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో జేసీ బి.నవ్య, డీఆర్వో వెంకటనారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కొండయ్య, చిరంజీవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను సానుభూతితో పరిష్కరించండి

(మొదటి పేజి తరువాయి)

పనితీరు మెరుగుపరుచుకుని అవినీతికి ఆస్కారం లేకుండా పనులు చేయాలని కలెక్టర్ మండలస్థాయి వీఆర్వోలను ఆదేశించారు. వీఆర్వో వ్యవస్థ ప్రక్షాళన జరిగిన ప్రజలకు మెరుగైన రీతిలో సేవలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామసభల ద్వారా 14వేల భూ సమస్యలు స్వీకరించారని ఆర్డీవోలు, తహశీల్దార్లు ప్రత్యేక దృష్టి పెట్టి ఈనెల 6వ తేదీ లోపల అప్‌లోడ్ చేయాలన్నారు. 101మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జాయింట్ కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు.

## క్రిప్టో కరెన్సీ కేసులో ముద్దాయి అరెస్ట్..రిమాండ్‌కు తరలింపు

**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్ః** క్రిప్టో కరెన్సీ కేసులో ముద్దాయిగా ఉన్న చందా రామాంజినేయులుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డోన్ డిఎస్‌పి శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక పోలీసుస్టేషన్ నందు ముద్దాయిని మీడియా సమావేశంలో హాజరు పరిచారు. అనంతరం డిఎస్‌పి శ్రీనివాసులు మాట్లాడుతూ 2021 నుంచి పట్టణంలో కేవా ఆయుర్వేదిక్ షాప్ నందు పనిచేస్తూ, తర్వాత అదే ప్రాంగణంలో తన కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకొని, ప్రజలకు లక్ష పెట్టుబడి పెడితే ప్రతినెల రూ.10వేలు వడ్డి అందిస్తానని ఆశచూపి, క్రిప్టో కరెన్సీ ట్రేడింగ్ ద్వారా లాభాలు వస్తాయని నమ్మించి డోన్ మరియు ఇతర ప్రాంతాలకు చెందిన దాదాపు 315 మంది వద్ద నుంచి మొత్తం రూ.23కోట్లు అక్రమ డిపాజిట్ల రూపంలో సేకరించాడన్నారు. వాటినే విడతల వారిగా వడ్డి రూపంలో తిరిగి చెల్లిస్తూ నమ్మించి మోసం చేస్తూ, అధిక డిపాజిట్లు పొందినాడని, క్రిప్టో కరెన్సీ ట్రేడింగ్‌లో నష్టాల తరువాత వడ్డి చెల్లించడం సెప్టెంబర్ 2024 నుండి నిలిపేశాడన్నారు. దీంతో జిల్లా ఎస్‌పి ఆదేశాలనుసారం సదరు ముద్దాయి చందా రామాంజినేయులను అదుపులోకి తీసుకోవడం కొరకు ప్రత్యేక బృందాలుగా పోలీసులు విడిపోయి దర్యాప్తు చేయడం జరిగిందన్నారు. దీంతో సోమవారం సాయంత్రం ముద్దాయిని ప్రత్యేక బృందం అరెస్ట్ చేసి, అతని ఖాతాలో ఉన్న రూ.2.5కోట్లు డబ్బులను సీజ్ చేసినట్లు తెలిపారు. దర్యాప్తులో భాగంగా బాదితులను పూర్తి స్థాయిలో విచారించి వారికి చట్టపరంగా తగిన న్యాయం కోర్టు ద్వారా త్వరితిగతిన చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రత్యేక బృందాన్ని జిల్లా ఎస్‌పి అభినందించారు.



ముద్దాయిని అరెస్ట్ చూపుతూ సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి శ్రీనివాసులు

# ప్రజా సమస్యల పరిష్కార వేదికకు గైర్హాజరైన అధికారులు

(మొదటి పేజి తరువాయి)

ప్రజా వేదిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఈ కార్యక్రమం మండలంలో నామమాత్రంగా మారింది. సోమవారం నిర్వహించిన ప్రజా వేదిక కార్యక్రమానికి మండల అధికారులు ఎవ్వరు హాజరు కాకపోగ, ఒక్క ఐసిడిఎస్ సూపర్వైజర్ మాత్రమే హాజరు కావడం వీరి నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలిచింది. తహశీల్దారు రవి కుమార్ తన కార్యాలయంలో సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి విఆర్ఓలతో సమావేశం నిర్వహిస్తుండగా, ఎంపీడిఓ రాజేంద్రప్రసాద్ తన కార్యాలయంలో ప్రజా వేదికకు హాజరు కాగా మిగతా శాఖలకు చెందిన అధికారులు చుట్టం చూపుగా కార్యక్రమం ప్రారంభంలో అలా వచ్చి ఇలా వెళ్ళి పోయారని తెలుస్తుంది. ఇదిలా ఉంటే 3 నెలలకు ఒకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశానికి అన్నీ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులకు సర్కులర్ పంపినా ఎమీ పట్టించుకోకుండా అసలేమి తెలియనట్లు వారు ప్రవర్తిస్తున్నారని ఎంపీపీ వీరభద్రుడు పలుమార్లు సమావేశంలో ఆరోపించారు. ప్రతి గ్రామంలో పరజలు వివిధ సమస్యలతో సతమతమవుతున్నా ఏవ్వరికి పట్టనట్లు అధికారులు వ్యవహారిస్తున్నారనే విమర్శలు కోకోల్లలున్నాయి. ఆయా గ్రామాలకు చెందిన పంచాయితి, రెవెన్యు ఉద్యోగులు ఉదయం గ్రామాలలోని కార్యాలయాలకు వెళ్ళి హాజరు వేసి వెంటనే మండల కేంద్రమైన చాగలమర్రికి వచ్చేస్తున్నారు. దీంతో వివిధ అవసరాల నిమిత్తం కార్యాలయాలకు వచ్చిన గ్రామస్తులు అధికారుల కోసం విచారించాల్సి వస్తుందని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైె సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలకు భారం మోపడం సరికాదు

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరు నెలల్లోనే రెండుసార్లు విద్యుత్‌ఛార్జీలుపెంచి ప్రజలకు భారం మోపడం సరికాదని వైసీపీ నాయకులు వై. రుద్ర గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహ్మద్, నాయకులు నాగేశప్ప, సునీల్ కుమార్, గడ్డం నారాయణరెడ్డిలుమండిపడ్డారు. వైఎస్ఆర్సీపి నియోజకవర్గ ఇంచార్జి బుట్ట రేణుక ఆదేశాల మేరకు పార్టీ కార్యాలయం నుండి విద్యుత్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బాబు ష్యూరిటీ.. భవిష్యతు గ్యారంటీ అని టీడీపీ నేతలు ప్రచారం చేయగా..వాస్తవ పరిస్థితి చూస్తే బాబు ష్యూరి టీ.. బాదుడు గ్యారంటీ అనేది స్పష్టంగా తెలుస్తోందని ఆరు నెలల్లో రెండుసార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలకు వాతలు పెట్టిన చంద్ర బాబు విద్యుత్ చార్జీలు పెంచి, తమపై నిందలు మోపడం దారుణమన్నారు. ఈ ఐదు నెలల్లోనే ప్రజలపై రూ.15,486 కోట్ల అదనపు భారం మోపితే.. చంద్రబాబు హయాంలో ఇప్పటి వరకు రూ.90 వేల కోట్ల భారం వేశారని మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో కరెంట్ చార్జీలు పెంచనని చెప్పి ఇష్టారీతిన పెంచుతున్నారని దుయ్యబట్టారు. వెంటనే విద్యుత్ చార్జీలను తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైసీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న వైసిపి నాయకులు

# యునాని వైద్యశాలలో మందుల కొరత

**– వైద్యశాలకు మందులు సరఫరా చేయాలని కోరుతున్న ప్రజలు**
**– మందుల కొరతను తీర్చుతాం.. ఆర్.డి.డి కిశోర్ రాజు**



మాట్లాడుతున్న డాక్టర్ షకీరా బేగం

**దొర్నిపాడుమేజర్,న్యూస్ః** ప్రభుత్వం ఆయుర్వేద వైద్యం ప్రజలకు అందించాలనే ఉద్దేశంతో మండల కేంద్రమైన దొర్నిపాడు గ్రామంలో వైద్యశాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ వైద్యశాల ద్వార అనేక మంది రోగులు ఆయుర్వేద వైద్యాన్ని సద్వినియోగం చేసుకొని ఎన్నో రోగాల బారి నుండి బయటపడటం జరిగింది. వైద్యశాలలో వైద్యాధికారిని డాక్టర్ షకీరా బేగం ఆధ్వర్యంలో మెరుగైన వైద్య సేవలను గత కొంత కాలంగా ప్రజలకు అందివ్వడం జరుగుతుంది. అయితే గత సంవత్సరం నుండి వైద్యశాలలో మందుల కొరత తీవ్రంగా ఏర్పడి ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వైద్యశాలకు మందులను సరఫరా చేయాలని ఉన్నతాధికారులను వారు కోరుతున్నారు. దీనిపై ఆర్జేడి శేఖర్‌రాజును వివరణ కోరగా ఇటీవల కమీషనర్ ఆధ్వర్యంలో నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో మందుల కొరతపై కమీషనర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని కావాల్సిన మందుల ఇండెంట్ రూపంలో అందించాలని ఆయన తెలిపినట్లు ఆయన అన్నారు. సకాలంలోనే వైద్యశాలలకు మందులు సరఫరా చేయడం జరుగుతుందని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అలాగే వైద్యశాలలో సిబ్బంది కొరతపై వివరణ కోరగా ఖాళీగా ఉన్న అటెండర్ పోస్టును కూడా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి భర్తీ చేస్తామని ఆయన తెలిపారు.

**యునాని వైద్యశాల వైద్యాధికారిని డాక్టర్ షకీరా బేగం :** మందుల కొరత విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానని సకాలంలోనే వైద్యశాలకు మందులు సరఫరా చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. అలాగే మొక్కల ఆకుల ద్వార కలిగే ప్రయోజనాలపై త్వరలోనే ఆహ్వాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకొని మెరుగైన వైద్య సేవలను పొందాలని ఆమె కోరారు.

# ప్రజాసమస్యలను వేగవంతంగా పరిష్కరించాలి–సబ్ కలెక్టర్



అర్జీలను స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్

**ఆదోని, మేజర్ న్యూస్ :** పబ్లిక్ గ్రీవెన్స్ ద్వారా వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా వేగవంతంగా పరిష్కరించాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం పిజిఆర్ఎస్) కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి పాల్గొని డివిజన్ నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను సబ్ కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తున్న అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీతగడువులోగా పరిష్కరించాలన్నారు. ఈ ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలను నేరుగా పర్యవేక్షణ చేసే అవకాశం కూడా ఉందన్నారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఏలోని దరఖాస్తులు వెంటనే చర్యలు తీసుకొని పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం వివిధ సమస్యలతో కూడిన వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఆదోని పట్టణంలోని వైఎస్సార్ నగర్‌లో 3వ లైన్ తాగునీటి పైపు లేదని, కాలనీలోని సమీపంలో ఉన్న బోరు కూడ పనిచేయడం లేదని, మా కాలనీ సమస్యలను పరిష్కరించాలని కోరారు. పెద్దకడుబూరు మండల పరిధిలోని హలికన్వి గ్రామానికి చెందిన దత్తాత్రేయకు సంబంధించిన సర్వే నెం. 266నందు 2.63 ఎకరాల భూమి పెద్దల నుండి సంక్రమించింది. ప్రస్తుతం సదరు భూమికి పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు. ఆదోని మండలం గణ్ణేకల్లు గ్రామానికి చెందిన ఆంజనేయకు సంబంధించిన సర్వే నెం.17ఈలో 1.26 ఎకరాల భూమి ఆన్‌లైన్, ఆడంగల్‌లో నమోదు చేయాలన్నారు. ఆదోని మండలం బసరకోడు గ్రామానికి చెందిన ఆంజినప్పకు సంబంధించిన సర్వే నెం.51లో 7.33 ఎకరాల భూమి మా పెద్దల నుంచి సంక్రమించింది. ప్రస్తుతం సదరు భూమి ఆన్‌లైన్‌నందు నమోదు చేసి పట్టాదారు పాస్‌పుస్తకం మంజూరు చేయవలసిందిగా అర్జీ సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ సర్వేయర్ శ్రీనివాస్ రాజు, వేణు సూర్య, గృహ నిర్మాణ శాఖ డిప్యూటీ ఇంజనీర్ రవి కుమార్, ఆర్అండ్‌బి డిప్యూటీ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ చేతన్ ప్రియా, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓ సత్యవతి, డిప్యూటీ డిఈఓ వెంకటరమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సూర్య



# చనుగొండ్లలో వ్యక్తి అనుమానస్పద మృతి

### హత్యనా.. ఆత్మహత్యనా..?

### కొనసాగుతున్న పోలీసులు విచారణ



**కోడుమూరు, మేజర్‌న్యూస్:** గూడూరు మండలం చనుగొండ్ల గ్రామానికి చెందిన ఉప్పరి శ్రీరాములు కుమారుడు ఉప్పరి శివ (25) సోమవారం చెట్టుకు వేలాడుతూ శవమై కనిపించాడు. వివరాల్లోకి వెళితే ఇలా వున్నాయి. చనుగొండ్ల గ్రామానికి చెందిన ఉప్పరి శ్రీరాములుకు ముగ్గురు కుమారుల్లో ఇద్దరికి వివాహం చేయగా అవివాహితుడైన మూడవ కుమారుడు శివ గ్రామంలోనే పంచర్ షాపు పెట్టుకుని ప్రతిరోజు రాత్రి భోజనం అనంతరం పంచర్ షాపులోనే నిద్రపోయేవాడు. అయితే ఆదివారం రాత్రి యధావిధిగానే షాపుకువెళ్లి వర్కూర్ గ్రామ శివార్లలోని పొలంలో చెట్టుకు వేలాడుతూ శవమై కనిపించాడు. అయితే రాత్రి సమయంలో తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని శివ సెల్ నుండి తన అన్న సెల్ కు మెసేజ్ వచ్చింది. ఆ మెసేజ్ ను తెల్లవారుజామున లేచి చూసిన అన్న కుటుంబసభ్యులు ముందుగా పంచర్ షాపుకి వెళ్లి చూడగా, అక్కడ ద్విచక్రవాహనం, పంచర్ వేసే పరికరాలను పగులగొట్టినట్లు ఉండగా అక్కడ శివ కనిపించక పోవడంతో గూడూరు పోలీస్ స్టేషన్ కు వెళ్లి పోలీసులకు సమాచారం అందించారు. వారు శివ సెల్ లొకేషన్ ఆధారంగా వర్కూర్ గ్రామానికి చెందిన రైతు పొలంలోకి వెళ్లి చూస్తే చెట్టుకు వేలాడుతున్న శివను చూసి దిగ్భ్రాంతి గురైనారు. శివ మరణం హత్య నా





ఆత్మహత్య నా అని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పంచర్ షెడ్ లో పనిచేస్తున్న శివ ను నిన్నరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారా లేక ఆత్మ హత్య చేసుకున్నాడా అని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. విషయం తెలిసిన వెంటనే సిఐ తబ్రీజ్, కోడుమూరు, గూడూరు ఎస్ ఐ లు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. జగిలాలను పిలిపించి కేసును చే దించేందుకు కృషి చేస్తున్నారు. శివ మరణం హత్య నా.. ఆత్మ హత్యనా పోలీస్‌ల విచారణ లో తేలాల్సి వుంది.

# రైలు ఢీకొని విద్యార్థి దుర్మరణం

### – అధికారుల నిర్లక్ష్యంపై విద్యార్థి సంఘాల ఆందోళన

**నంద్యాల క్రైం, మేజర్‌న్యూస్ :** నంద్యాల పట్టణంలోని బొమ్మల సత్రం సమీపంలో ఉన్న ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ హాస్టల్‌లో ఉంటూ పాలిటెక్నిక్ చదువుతున్న విద్యార్థి రైలు ఢీకొని దుర్మరణం చెందాడు. విద్యార్థి సతీష్ రోజులాగే ఉదయం నిద్ర లేచి కాలకృత్యాలు తీర్చుకునేందుకు హాస్టల్ పక్కనే ఉన్న రైలు పట్టాలపైకి బహిర్భూమికి వెళ్తుండగా వెనుక నుంచి రైలు వచ్చి ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన సతీష్‌ను తోటి విద్యార్థులు ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. ప్రమాదంలో సతీష్ తలపై తీవ్ర గాయాలయ్యాయి. హాస్టల్‌లో కనీస సౌకర్యాలు, మరుగు దొడ్లు లేకపోవడంతో విద్యార్థులు ఆరుబయటకు వెళ్తున్నారు. కనీసం హాస్టల్‌కు కాంపౌండ్ వాల్ కూడా లేకపోవడం తరుచు హాస్టల్‌లోకి పాములు వస్తున్నట్లు విద్యార్థులు పేర్కొన్నారు. సరైన సౌకర్యాలు ఉంటే సతీష్ మృతి చెందేవాడేకాదని తోటి విద్యార్థులు వాపోయారు. విద్యార్థి మృతి చెందిన సంఘటన తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు పెద్ద ఎత్తున ర్యాలీ చేసి అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. కలెక్టర్‌ను కలిసి హాస్టల్‌లో ఉన్న పరిస్థితులను వివరించారు. ఎంతో భవిష్యత్తు ఉన్న విద్యార్థి మృతి చెందడం భాదాకరమని, మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న ఎస్సై దిలీప్ కుమార్

### విద్యార్థులు

# క్రమశిక్షణతో మెలగాలి

**ఆలూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని అరికెర డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులు విద్యతో పాటు క్రమ శిక్షణతో మెలగాలని ఎస్సై దిలీప్ కుమార్ సూచించారు. సోమవారం ప్రిన్సిపాల్ నరసింహులు ఆధ్వర్యంలో విద్యార్థులు తో సమావేశమై వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు మంచి క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని తెలి పారు. ఎటువంటి చెడు వ్యసనాలకు అల వాటు పడకూడదని, ఎవరు కూడా టీచర్లకు తెలియకుండా పాఠశాల దాటి వెళ్ళరాదని తెలియచేశారు. దొంగ తనాలు, స్మోకింగ్, గుట్కా వంటి చేదు వ్యసనాలకు అలవాటు పడరాదని అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మనోరాజ్, లక్ష్మన్న, ప్రదీప్,నాగ శేషు, బాలచంద్ర, మురళి పాల్గొన్నారు.

# ముమ్మరంగా పూడికతీత పనులు



**కర్నూలు నగరం, మేజర్‌న్యూస్:** నగరవ్యాప్తంగా మురుగు కాలువల్లో పూడికతీత పనులు ముమ్మరం చేయాలని నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదేశించారు. సోమవారం కృష్ణానగర్, బిర్లాకాంపౌండ్, సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. మురుగుకాలువల్లో మురుగునీరు ప్రవామానికి ఆటంకం లేకుండా పూడికతీత పనులు త్వరితగతిన చేపట్టాలని ఆదేశించారు. పూడికతీత పనులకు ఆటంకం కలిగిస్తున్న పలు కాలనీల్లో కల్వర్టులు, మురుగుకాలువ నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈఈ మనోహర్‌డడెఇ్ఙ, శ్రీనివాసరెడ్డి, ఏఈ మనోహర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ అనిల్ పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం ద్వారానే గ్రామాలు అభివృద్ధి



విధుల్లో పనులు చేయిస్తున్న నాయకులు

**హొళగుంద, మేజర్‌న్యూస్ :** కూటమి ప్రభుత్వం ద్వారానే గ్రామాలు అభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకులు అన్నారు.స్థానిక 4వ వార్డులో సీసీ రోడ్డు,డ్రైనేజీ పనులను చేపట్టారు.ప్రధాన రోడ్డు కావడంతో నిత్యాం ట్రాక్టర్లు,ఎడ్లబండ్లు తిరుగుతాయని రోడ్డును వెడల్పుగా ఉంటే రాకపోకాలు జరుగుతాయన్నారు.రోడ్డును వెడల్ప చేయడంతో రైతులు,ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అబ్దుల్ సుభాన్,దిడ్డి నాగప్ప,సలాం ఇస్మాయిల్ పాల్గొన్నారు.

# అనుమతి లేని డయాగ్నోస్టిక్ సెంటర్లను సీజ్ చేయాలి

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్:** ప్రభుత్వ అనుమతి లేని డయాగ్నోస్టిక్ సెంటర్లను సీజ్ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు, జిల్లా కార్యవర్గ సభ్యులు చంటి, నాగేశ్వరరావు, నగర ఆర్గనైజింగ్ కార్యదర్శి క్రిష్ణ, నగర నాయకులు శివాజీ కోరారు. ఈ మేరకు సోమవారం నగరంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంతమంది ప్రైవేటు వ్యక్తులు విచ్చలవిడిగా డయాగ్నోస్టిక్ సెంటర్లను ఏర్పాటు చేసుకొని ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. నగరంలోని డయాగ్నోస్టిక్ సెంటర్లను తనిఖీ చేసి అనుమతి లేని వాటిని సీజ్ చేయాలన్నారు.




వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

లేని పక్షంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.




# మద్యం మత్తులో బ్రిడ్జిపై నుంచి వాగులో పడిన వ్యక్తి

### బ్రిడ్జికి ఇరువైపులా లేని రక్షణ కవచం

**బండిఆత్మకూరురూరల్ , మేజర్‌న్యూస్:** మండల కేంద్రంలోని బండి ఆత్మకూరులో సోమవారం సాయంత్రం అతీగా మద్యం సేవించిన వ్యక్తి స్థానిక బ్రిడ్జి పై నుండి అదుపుతప్పి కుందు నదిలో పడిపోయాడు. స్థానికులు చెప్పిన వివరాల మేరకు బండి ఆత్మకూరు గ్రామానికి చెందిన మద్దిలేటి సోమవారం సాయంత్రం అధికంగా మద్యం సేవించి, ఊగుతూ బ్రిడ్జి పై నడుచుకుంటూ వెళ్తూ ప్రమాదవశాత్తు కుందూ నదిలో పడిపోయాడన్నారు. గమనించిన అక్కడ ఉన్న స్థానికులు,పోలీస్ సిబ్బంది మనోహర్,రఫీ వాగులో పడిన మద్దిలేటిని తాళ్ల సాయంతో బయటికి తీశారని అన్నారు. పలుమార్లు గ్రామసభలో స్థానికులు ఫిర్యాదులు చేసిన సంబంధిత అధికారులు చర్యలు తీసుకున్న పాపాన పోలేదని, కనీసం రక్షణ కవచనం అయిన ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

# అదనపు కట్నం కోసం భార్యను వేధించిన భర్త

### అత్త, మామ, మరిది, ఆడబిడ్డపై కేసు నమోదు

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** అదనపు కట్నం తీసుకురావాలని శారీరకంగా, మానసికంగా వేదింపులకు గురి చేసిన భర్త, మరిది, అత్త, మామ, అడబిడ్డ, అడబిడ్డ భర్త ల పై కేసు నమోదు చేసినట్లు సీఐ గంగాధర్ తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు గోనెగండ్ల మండలం గాజులదిన్నె గ్రామానికి చెందిన కురవు సుజాతను గత మూడేళ్ల క్రితం పత్తి కొండ గ్రామానికి చెందిన మా ల్లికార్జునకు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. గత రెండేళ్లుగా అదనపు కట్నం తీసుకురావాలని సుజాతను భర్త మల్లికార్జున. మరిది లక్ష్మీకాంతం, అత్త ఎల్లమ్మ, మామ మల్లికార్జున, అడబిడ్డ కామాక్షి, ఆడబిడ్డ భర్త సుంకన్నలు మానసికంగా, శారీరకంగా వేదించడం మొదలు పెట్టారు. వీరి మనసు మారి తన కాపురం నిలుస్తుందని సుజాత ఎంతో ఓపిక పట్టింది. అయితే రెండేళ్లనుంచి వేదింపులలో మార్పురాకపోవడం తో ఇక వీరు మారరు అని తలచి వారి వేదింపులు తాళలేక సోమవారం గోనెగండ్ల పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలు సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

# కర్ణాటక బస్సు ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన సాయిలన్న

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయంలో బస్సు ఢీకొని మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకొంది. వివరాలు ఇలా ఉన్నాయి. మంత్రాలయం మండలం చట్నేపల్లి గ్రామానికి చెందిన సాయిలన్న(50)ను కర్ణాటక బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సాయిలన్న భిక్షాటన చేస్తూ, జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

# పేకాటరాయుళ్లు అరెస్ట్

**బనగానపల్లెమేజర్,న్యూస్:** బనగానపల్లె పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో గల నూకల రెసిడెన్సీ నందు పేకాట ఆడుతున్న యాగంటిపల్లెకు చెందిన మధుసూదన్, సోమన్నగారి జగత్ విఖ్యాత్ రెడ్డి, బత్తుల వెంకటేశ్వర రెడ్డి, సోమన్న గారి మల్లికార్జున రెడ్డి, ముక్కమళ్ల శివప్రకాష్ రెడ్డి, చౌడం బాలక్రిష్ణ, ఆరుగురు వ్యక్తులను పోలీసులు దాడులు చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 9,400 రూపాయలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు బనగానపల్లె ఎస్.ఐ దుగ్గిరెడ్డి తెలిపారు.

# అల్లీనగరంలో ఉచిత వైద్య శిబిరం

**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది మండలంలోని అల్లీనగరం గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సోమవారం వ్యవసాయ కళాశాల విద్యార్థులు నిర్వహిస్తున్న జాతీయ సేవా పథకం కార్యక్రమంలో భాగంగా ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామ ప్రజలకు డాక్టర్ రాజా రమేష్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, ప్రొఫెసర్ నారాయణరావు, స్వరాజ్యలక్ష్మి, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# దీర్ఘకాలిక భూ సమస్యలకు పరిష్కారం

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** గత 12సంవత్సరాల నుంచి దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించామని జిల్లా కలెక్టర్ రాజకుమారి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించి సంబంధిత భూ ఉత్తర్వులు బాధితులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ 12 సంవత్సరాల నుండి వివిధ చిక్కుముడులతో పెండింగ్‌లో ఉండి పరిష్కారం కాని సమస్యలను సంబంధిత రికార్డులను పరిశీలించి పరిష్కారం చూపామన్నారు. భూ సమస్యల పరిష్కారానికి తహశీల్దార్లు, ఆర్డీవోల కార్యాలయాల్లో చుట్టూ తిరిగి విసిగివేశారి పోయామని బాధిత రైతులు విన్నవించడంతో ఇందుకు సంబంధించిన రికార్డులను క్షేత్రస్థాయి నుంచి తెప్పించుకుని భూ సమస్యలను పరిష్కరించామన్నారు. తహశీల్దార్లు, ఆర్డీవోలు, సెక్షన్ సిబ్బంది త్వరితగతిన భూ సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. బాధితుల సర్వే నెంబర్లు రిజిస్ట్రేషన్ ఐజిఆర్ఎస్ నిషేదిత జాబితాలో డీ నోటిఫై చేయాలని రిజిస్ట్రార్‌ను కలెక్టర్ ఆదేశించారు. దీర్ఘకాలిక భూ సమస్యలను పరిష్కరించిన రైతులకు ప్రతులను పంపిణీ చేశారు.

సూర్య
మంగళవారం | 03 డిసెంబర్ 2024

# రాయితీపై సోలార్ రూఫ్‌టాప్ నిర్మించుకోండి

## - జిల్లా కలెక్టర్ రాజకుమారి

**నంద్యాలకల్చరల్, మేజర్‌న్యూస్ :** ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం కింద గృహ వినియోగదారులకు రాయితీపై సోలార్ రూఫ్‌టాప్‌లను ఏర్పాటు చేయనున్నామని, ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి తెలిపారు. సోమవారం పీజిఆర్‌ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం గోడపత్రికను ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో రాయితీపై సోలార్ రూఫ్‌టాప్ నిర్మించుకోవాలన్నారు. గృహ వినియోగదారులు కూడా తమ ఇళ్ళపై ఉన్న కప్పుపై సోలార్ రూఫ్‌టాప్‌లను ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్తు బిల్లులు తగ్గించుకోవాలన్నారు. ఒక కిలోవాట్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్‌టాప్‌త ఏర్పాటుకు 100చ.అ స్థలం అవసరమన్నారు. నెలకు 130యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని ఇందుకోసం రూ.60వేల నుంచి రూ.70వేల వరకు ఖర్చవుతుందన్నారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.30వేల రాయితీ లభిస్తుందన్నారు. రూ.వెయ్యి బిల్లు వచ్చే వారికి సోలార్ ఏర్పాటు తరువాత కేవలం రూ.338లు మాత్రమే వస్తుందన్నారు. 2కి.వా సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్‌టాప్ రూ.1.30లక్షల నుంచి రూ.1.40లక్షల ఖర్చుతో 300చ.అ స్థలంలో ఏర్పాటు చేసుకుంటే 240యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని, దీనికి రూ.60వేలు రాయితీ లభిస్తుందన్నారు. 3కి.వా సామర్థ్యం యూనిట్స్‌కు రూ.78వేల రాయితీ వస్తుందన్నారు. ఈపథకం కింద బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీతో రుణాలు పొందే అవకాశం ఉందన్నారు. ఈ పథకాన్ని జిల్లాలోని గృహ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి ఉన్న వారు ఏపీఎస్‌పీడీసీఎల్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సోలార్ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను వినియోగదారులు తమ ఇళ్ళకు వినియోగించుకోగా ఇంకా మిగిలితే దానిని విద్యుత్ శాఖ కొనుగోలు చేసే వెసులుబాటు కూడా ఉందన్నారు. ఈసమావేశంలో నెడ్‌క్యాప్ అభివృద్ధి అధికారి వీరేంద్రబాబు, విద్యుత్ శాఖ ఎస్ఈ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం గోడపత్రికను విడుదల చేస్తున్న కలెక్టర్ రాజకుమారి

**ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో జిల్లా రెండో స్థానం :**

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో జిల్లా రెండో స్థానంలో నిలిచిందని జిల్లా కలెక్టర్ రాజకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 2,16,606 మందికి గాను 2,14,777మందికి రూ.90.93కోట్ల పెన్షన్ మొత్తాన్ని పంపిణీ చేసి 99.16శాతం పూర్తి చేయడం జరిగిందన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి

# మిర్చి రైతుకు నష్టపరిహారం అందించాలి

## పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి

**కల్లూరు, మేజర్‌న్యూస్:** కల్లూరు మండలం కొంగనపాడు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త నాగయ్యకు చెందిన రూ.30లక్షల విలువైన మిర్చిపంటకు వైసీపీ మూకలు పెట్రోలు పోసి తగులబెట్టారని, ఆ రైతును ప్రభుత్వం ఆదుకోవాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషను కలిసి రైతును ఆదుకోవాలని తెలిపారు. బైరాపురం గ్రామ రైతులు గత కొన్నేళ్లుగా సాగు చేసుకున్న పొలాలకు పాస్‌పుస్తకాలు ఉన్నా భూ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం లేదని, వెంటనే చొరవ తీసుకొని వారి సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

# వీరభద్రేశ్వర దక్షిణమూర్తి దేవాలయాల్లో దీపోత్సవం

**హొళగుంద,మేజర్‌న్యూస్ :** కార్తీకమాస ముగింపు అమావాస్య తరవాత పాడ్యమి రోజున సోమవారం స్థానిక వీరభద్రేశ్వర స్వామి, దక్షిణమూర్తి స్వామి దేవాలయాల్లో దీపోత్సవ కార్యక్రమం భక్తులు ఘనంగా నిర్వహించారు. స్వామి వార్లకు విశేషంగా పూజలు చేసి ప్రత్యేకంగా ఆలంకరించారు. దేవాలయ ప్రాంగణంలో అలమరిచిన దీపాలను భక్తులు ఓం నమః శివాయ అనే నినాదాలతో వెలిగించారు.దీపాల కాంతులతో దేవాలయాల్లో శోభిల్లింది.వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.


అలంకరణలో దక్షిణమూర్తిస్వామి


ఈశ్వర ఆకృతితో దీపాలు

# జొన్నలో కత్తెర పురుగు నివారణ చర్యలు

## - రైతులకు సూచనలు చేస్తున్న ఏటీఎం రాజేష్

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** రైతులు జొన్నలో కత్తెర పురుగు నివారణకు చర్యలు చేపట్టాలని అసిస్టెంట్ టెక్నికల్ మేనేజర్ (ఏటీఎం ఆత్మ) రాజేష్ రైతులకు సూచించారు. సోమవారం నంద్యాల ఏడీఏ సూచనల మేరకు నంద్యాల జిల్లా బండిఆత్మకూరు మండలంలో జొన్న పంటను ఆయన పరిశీలించారు. జొన్న విత్తనాన్ని ముందు శుద్ధి చేసుకోవాలని, విత్తిన 20 నుంచి 25 రోజులకు కూడా పురుగు ఆశిస్తే నివారించుకోవచ్చునని తెలిపారు. ఈ కత్తెర పురుగు నివారణకు పది వేలు పీపీఎం అనే వేప నూనెను 200 ఎంఎల్ ఎకరానికి పిచికారి చేసుకోవాలని అన్నారు. మొదటి దశ లార్వాలను నివారించడానికి బ్యాక్టీరియా సంబంధిత మందులను (బీటీ ఫార్మలేషన్) 2 గ్రాములు లేదా క్లోరోపైరీపాస్ 2.5 మి.లి లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని అన్నారు. రెండవ దశ 31 నుంచి 65 రోజులలోపు జొన్నలో 6 -10 శాతం పురుగు ఆశించిన మొక్కలను గమణించి వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏదైనా సందేహాలు ఉంటే ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకొచ్చి సమస్యను పరిష్కరించుకోవాలని రైతులకు సూచించారు.


జొన్న పంటను పరిశీలిస్తున్న ఏటీఎం ఆత్మ రాజేష్

# అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించండి

## - చీఫ్ గ్రీవెన్స్ ఆఫీసర్ చిన్నారావు

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలని చీఫ్ గ్రీవెన్స్ ఆఫీసర్ చిన్నారావు పేర్కొన్నారు. సోమవారం విజయవాడ సీఎంఓ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పీజీఆర్‌ఎస్ గ్రీవెన్స్ ఆడిట్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో ఇచ్చిన అర్జీలకు ఎండార్స్‌మెంట్‌లు స్పష్టంగా ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పీజీఆర్‌ఎస్ గ్రీవెన్స్ అడిట్‌ను పొరపాట్లు లేకుండా నిర్వహించాలని జిల్లా అధికారులకు సూచించారు. పీజీఆర్‌ఎస్ గ్రీవెన్స్‌కు సంబంధించి శాఖల వారీగా అనాలసిస్ డేటాను కూడా ప్రతి జిల్లాకు పంపించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఏవైనా గ్రీవెన్స్‌లు పరిష్కారం చేయలేనివి ఉంటే వాటిని వెంటనే క్లోజ్ చేయకుండా ప్రభుత్వం దృష్టికి పంపించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీజీఆర్‌ఎస్ నోడల్ అధికారిణి దీప్తి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

# మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం: కమిషనర్


అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్

**కర్నూలు నగరం, మేజర్‌న్యూస్:** నగర ప్రజల అభ్యర్థనల మేరకు వీధుల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కర్నూలు నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి 16అర్జీలను కమిషనర్ స్వీకరించారు. వాటి పరిష్కారానికి తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి.క్రిష్ణ, మేనేజర్ చిన్నరాముడు, ఆరోగ్య అధికారి విశ్వేశ్వరరెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఆర్‌ఓలు జునైద్, ఇశ్రాయేలు, ఎంఈలు శేషసాయి, సత్యనారాయణ, టీపీఆర్‌వో వెంకటలక్ష్మి, టిడ్కో అధికారి పెంచలయ్య పాల్గొన్నారు.

## చిలకలడోణ గ్రామంలో

# నీటి కొరతను వెంటనే పరిష్కరించాలి

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి జయరాజు, నాయకులు తిక్కన్న, రాముడులు డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని చిలకలడోణ గ్రామంలో గ్రామ ప్రజలతో ఖాళీ బిందేలను చేత పట్టుకొని రోడ్డుపై ధర్నా చేస్తూ, బైఠాయించి రాస్తారోకో చేపట్టి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్‌రెడ్డి, మండల ఇంచార్జీ విశ్వనాథ్‌రెడ్డితో కలిసి గ్రామీణ నీటి సరఫరా శాఖ ఏఈ వెంకట్రాముడుకు అందజేశారు. చిలకలడోణ గ్రామంలో సుమారు 15నెలలుగా తాగునీరు సరిగా రాకున్నప్పటికీ పట్టించుకొనే అధికారులు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో తాగునీరు లేక వృద్ధులు, వికలాంగులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మంత్రాలయం నుంచి చిలకలడోన గ్రామం వరకు గతంలో వేసిన ఎన్ఏపి పైపులైన్ ద్వారా నీళ్లు రావడం లేదని పాత పైపులైన్ తొలగించి కొత్త పైపులైన్ వేయాలని, ప్రతి ఇంటికి కొళాయిలను ఏర్పాటు చేయాలని, ప్రతి కాలనీలో ట్యాంకులను ఏర్పాటు చేయాలని కోరారు. విద్యుత్ కోతలు లేకుండా చూడాలన్నారు. నెలకొక్కసారి ఎస్ఎస్ ట్యాంకును శుభ్రం చేయించాలని గ్రామస్తులకు నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు రాముడు, మాజీ సర్పంచు నరసన్న, ఎం.డి. షఫీ, వెంకటేష్, వికలాంగుల సంక్షేమ సంఘం నాయకుడు పెద్దయ్య, మాదన్న, హోటల్ వె ంకటరె డ్డి, సీపీఎం నాయకులు రాజు, దేవపుత్ర, దానియేలు, ప్రకాష్, ఆంజి, వినోద్ కుమార్, మహానంది, తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుమీద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు,గ్రామ ప్రజలు


ఖాళీబిందేలో ధర్నా నిర్వహించి వినతిపత్రాన్ని అందజేస్తున్న సీపీఎం నాయకులు

# కలెక్టర్‌ను కలిసిన కాటసాని రాంభూపాల్‌రెడ్డి


కలెక్టర్‌తో మాట్లాడుతున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

**కల్లూరు, మేజర్‌న్యూస్:** పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సోమవారం జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషను కలిశారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్‌ను కలిసి టీడీపీ నాయకులపై ఫిర్యాదు చేశారు. మర్కాపురం, తడకనపల్లె గ్రామాల్లో టీడీపీ నాయకులు దౌర్జన్యంగా రేషన్ డీలర్లను తొలగించడానికి అక్రమ కేసులు కుట్రలు చేస్తున్నారన్నారు. టీడీపీ నాయకులకు అధికారులు కూడా సహకారం చేస్తున్నారన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్లు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# ప్రజల నుండి వినతులను స్వీకరించిన మంత్రి బి.సి


అర్జీలను స్వీకరిస్తున్న దృశ్యం

**బనగానపల్లె, మేజర్‌న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కారానికే మొదటి ప్రాధాన్యం ఇస్తామని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి అన్నారు. సోమవారంనాడు బనగానపల్లె క్యాంపు కార్యాలయంలో వారు ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఒక్క బనగానపల్లె నియోజకవర్గం నుండే కాక నంద్యాల జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రజలు వారి సమస్యల పరిష్కారం కోసం మంత్రి బి.సికి వినతీపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా సమస్యల పరిష్కారానికే మొదటి ప్రాధాన్యాన్ని ఇస్తున్నామని అన్నారు. వచ్చిన అర్జీలలో కొన్నింటికి వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు ఫోన్ ద్వార ఆదేశాలు జారీ చేశారు. అర్జీలన్నింటిని ఆయా శాఖల అధికారులకు పంపించి వారి సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి బి.సి తెలిపారు.

### డ్యాన్స్ పోటీల్లో ప్రతిభ చాటిన

## ఉషా శివ డ్యాన్స్ అకాడమీ స్టూడెంట్స్



**శ్రీశైలం, మేజర్‌న్యూస్:** శ్రీశైలం ప్రాజెక్టు కాలనీలో నటరాజ్ డాన్స్ అకాడమీ నిర్వహించిన డాన్స్ పోటీల్లో స్థానిక ఉషశివ డాన్స్ అకాడమీ స్టూడెంట్స్ ప్రతిభ కనబరిచారు. పోటీల్లో మొదటి బహుమతితో పాటు కన్సోలేషన్ బహుమతిని కూడా సాధించి తమ ప్రతిభ చాటారు. ఈపోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులతోపాటు సర్టిఫికెట్లను కుడిగట్టు జల విద్యుత్కేంద్ర చీఫ్ ఇంజనీర్ కాంతారావు చేతుల మీదుగా నిర్వాహకులు అందజేశారు. ఉషాశివ డాన్స్ అకాడమీ స్టూడెంట్స్ గతంలో కూడా అనేక స్టేజి పెర్ఫార్మెన్సుస్తూ అందరి మన్నలను పొందారు.

### ఘనంగా డిగ్రీ కళాశాలలో

## కంప్యూటర్ అక్షరాస్యత దినోత్సవం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ హుస్సేన్ భాష

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** శ్రీశైలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ విభాగం ఆధ్వర్యంలో కంప్యూటర్ అక్షరాస్యత దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ పి.హుస్సేన్ బాషా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఈ ఆధునిక యుగంలో విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞాన్ని ఉపయోగించు కొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం కంప్యూటర్ అధ్యాపకురాలు డాక్టర్ యమ్.పద్మ మాట్లాడుతూ..నేటి కాలంలో ప్రతి పరిక్షా విధానం కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహిస్తున్నారనీ కావున పోటి పరీక్షల్లో గెలుపొందాలి అంటే తప్పనిసరిగా కంప్యూటర్ నేర్చుకోవాల్సిందే అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఏం.బుచ్చయ్య, అధ్యాపకులు డాక్టర్ కె.రాజన్న, మహేశ్వరరెడ్డి,బాలు,విద్యార్థులు పాల్గొన్నారు.

## అర్జీలను పరిశీలించి పరిష్కరిస్తాం



**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** ప్రజలు ఇచ్చిన అర్జీలను పరిశీలించి పరిష్కారం చూపుతామని ట్రైనింగ్ అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి అన్నారు. సోమవారం తాసిల్దార్ కార్యాలయం లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి ట్రైనింగ్ అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, మండల తాసిల్దార్ విద్యాసాగర్ వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు రైతులతో ప్రజలతో మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 8 అర్జీలు ప్రజల నుంచి వచ్చాయని నిర్ణీత గడువులోపు వాటి రికార్డులను పరిశీలించి వారి సమస్యలకు పరిష్కారం చూపుతామని తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసులు, పలువురు అధికారులు గ్రీవెన్స్ లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దారు మండల సర్వేర్, ఆర్ఐ,వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

# సిబ్బంది సహకారంతో కార్తీక మాసమంతా పకడ్బందీగా విధులు

- ఆత్మకూరు డీఎస్పీ రామాంజీనాయక్
- ప్రోటోకాల్ విషయంలో
  స్థానిక సీఐ ప్రసాదరావుని అభినందించిన డి.ఎస్.పి


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రామాంజి నాయక్

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** శ్రీశైలం క్షేత్రంలో కార్తీకమాసంతా పోలీస్ సిబ్బంది సహకారంతో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పకడ్బందీగా విధులు నిర్వహించినట్లు ఆత్మకూరు డిఎస్పీ రామాంజీ నాయక్ అన్నారు. శ్రీశైలం సర్కిల్ పోలీస్ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ..నంద్యాల జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నవంబర్ 2 నుండి డిసెంబర్ 2 వరకు శ్రీశైలం క్షేత్రంలో హెూంగార్డు స్థాయి నుంచి డి.ఎస్.పి స్థాయి వరకు కార్తీక మాసం అంత అంకితభావంతో విధులు నిర్వర్తించారన్నారు. కార్తీక మాస ఉత్సవాలు విజయవంతంగా ముగియటం సంతోషించదగ్గ విషయం అన్నారు. శని,ఆది సోమవారాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో వారి వాహనాల వలన సాక్షి గణపతి, అటకేశ్వరం సమీపంలో రోడ్డు మార్గాల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని పేర్కొన్నారు. ప్రోటోకాల్ విషయంలో స్థానిక సీఐ ప్రసాదరావును ఆయన అభినందించారు. అలాగే సీఐ కృష్ణయ్య,చంద్రబాబు పలువురు సిబ్బంది వారి వారి విధులను సక్రమంగా నిర్వర్తించారన్నారు. ఎక్కడ కూడా పోలీసులు సమన్వయం కోల్పోకుండా సహనం ఓదార్పుతో విధులు సక్రమంగా నిర్వర్తించడం సంతోషం అన్నారు సీఎం శ్రీశైలం పర్యటన సమయంలో కూడా పోలీసులు విధులు సక్రమంగా నిర్వర్తించి ఏర్పాట్లు బాగా చేశారని సీఎం కితాబ్ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. అలాగే కార్తీక మాసం చివరి సోమవారం శ్రీశైలం వచ్చిన హెూం శాఖ మంత్రికి అనేక సమస్యలు విన్నవించామని సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు డిఎస్పీ తెలిపారు. అందరి సహకారంతో కార్తీక మాస ఉత్సవాలు విజయవంతం కావటం హర్షినియమన్నారు.

**సంతోష్ నాయక్ కేసును పూర్తి స్థాయిలో విచారిస్తున్నాం**

శ్రీశైలంలో గత 2023 ఏప్రిల్ మాసంలో అనుమానాస్పదంగా మృతి చెందిన సంతోష్ నాయక్ కేసుపై డీఎస్పీ రామాంజీ నాయక్ మీడియాతో మాట్లాడారు. స్థానిక సీఐ ప్రసాదరావుతో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించినట్లు ఆయన తెలిపారు. సంతోష్ నాయక్ ది హత్య అని తల్లిదండ్రులు,గిరిజన సంఘాల నాయకులు అనుమానం వ్యక్తం చేసినప్పటికీ,అందుకు తగ్గ ఆధారాలు సక్రమంగా లేవన్నారు. విచారణ కొనసాగుతుందని, కేసును పూర్తిస్థాయిలో విచారించి తగు చర్యలుతీసుకుంటామన్నారు.

# ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ వేధింపులు తగదు


అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్లు

**బండిఆత్మకూరురూరల్, మేజర్‌న్యూస్:** మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పని చేసే ఫీల్డ్ అసిస్టెంట్ల పై రాజకీయ వేధింపులు ఆపాలని సిఐటియు నాయకులు రతమయ్య ,రాజు,ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ నాయకులు నాగరాజు నాగన్న లు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ మండలంలో వ్యవసాయ కూలీలకు నిరుద్యోగులకు రైతులకు పనులు చూపిస్తూ ఉపాధి చూపిస్తూ అది తక్కువ వేతనంతో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ ల పై కూటమి ప్రభుత్వం వచ్చిన ఐదు నెలల కాలంలో రాజకీయ వేధింపులు ఎక్కువ అయ్యాయని అన్నారు. ఇది మంచి ప్రభుత్వం అని చెప్పూనే స్థానికంగా ఉండే రాజకీయ నాయకులు చిరు ఉద్యోగులపై వేధింపులు చేసి,ఉద్యోగాల నుండి తొలగింపులు చేయాలని మానసిక ఇబ్బందులు గురి చేస్తున్నారని తెలిపారు. సంత జూటూరు ఎఫ్ఎపై దళిత కులమునకు చెందిన జయ సూర్యుడు 20 సంవత్సరాలుగా ఉపాధి పథకంలో పనిచేస్తూ ప్రజలకు కూలీలకు సేవలు అందిస్తున్నాడని,స్థానిక నాయకులు తమ వర్గానికి చెందిన అగ్రకులాల వారికి ఉద్యోగం ఇప్పించడానికి అధికారులపై ఒత్తిడి చేసి రాజీనామా చేయాలని ఒత్తిడి చేస్తున్నారని మండిపడ్డారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దారు ధోని ఆల్ఫ్రెడ్,ఎంపిడిఓ దస్తగిరి, ఏపీవో వసుధకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రిలో పెన్షన్ అందజేత



**ఓర్వకల్లు మేజర్ న్యూస్ :** నంద్యాల జిల్లా కేంద్రంలోని ఎం ఎస్ ఆర్ ప్రైవేట్ ఆస్పత్రిలో ఓర్వకల్లు గ్రామవాసికి డిజిటల్ అసిస్టెంట్ ఈ రమేష్ సోమవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అందజేశారు. మండల కేంద్రంలోని ఓర్వకల్లు గ్రామానికి చెందిన ఎస్ ఎల్లారెడ్డి బ్రెయిన్ స్ట్రోక్ తో నంద్యాల జిల్లా కేంద్రంలో ని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా డిజిటల్ అసిస్టెంట్ ఈ,రమేష్, టిడిపి నాయకులు జీకే అల్లబాబు, ఎం సామిరెడ్డి, ఆస్పత్రికి వెళ్లి 4000 రూపాయలు పెన్షన్ అందజెయడం జరిగింది. ఈ సందర్భంగా డిజిటల్ అసిస్టెంట్ ను టిడిపి నాయకులు అభినందించారు.

# నర్సింగ్ కళాశాలల అక్రమాలపై చర్యలు తీసుకోండి

### స్పందనలో కలెక్టర్కు వినతి



**కర్నూలు ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్ :** కర్నూలులో ఉన్న నర్సింగ్ కళాశాలల అక్రమ ఫీజుల దోపిడీ, దందాలతో విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఫ్లోరెన్స్ లైటింగ్ ఇన్ నర్సింగ్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు భాస్కర్ నాయుడు తెలిపారు. సోమవారము కలెక్టరేట్లోనూ సునయనలో జరిగిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రంజిత్ భాష కు నర్సింగ్ విద్యార్థుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సింగ్ విద్యార్థులకు కౌన్సిలింగ్ జరగకుండా అక్రమ అడ్మిషన్లు, దాని పేరుతో అడ్మిషన్ ఫీజులని, వేలకు పైగా వసూలు చేస్తున్నారని తెలిపారు. కాలేజీ బస్సులో వెళ్ళినా వెళ్లకపోయినా మా రూల్స్ ఇవే అంటూ కాలేజీ బస్ ఫీజులు కూడా కట్టించుకుంటున్నారని వివరించారు. గవర్నమెంట్ హాస్పిటల్లో ట్రైనింగ్ కొరకు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు కంటే ఎక్కువగా వసూలు చేస్తూ తెలిపారు. ఏ ఫీజులు కట్టిన రసీదు రుసుము ఇవ్వరని, పరీక్షల సమయంలో వాళ్లు ఎంట్రీ చేసుకోకపోగా వాళ్లకు గుర్తు ఉండకపోగా మరలా మరలా ఇబ్బందులకు గురి చేస్తూ ఫీజులు కట్టించుకుంటూ ఉన్నారని వివరించారు. విద్యార్థులు ఇలా ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని, అధికంగా ఫీజులు వస్తూ వసూలు చేస్తున్నారని విద్యార్థులు యజమాన్యాన్ని ప్రశ్నిస్తే ఎవరికైనా చెప్పుకోండి ఎక్కడైనా కంప్లీట్ చేసుకోండి అని కళాశాలల యజమాన్యం అంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా ఏమైనా ఎక్కువ మాట్లాడితే ప్రాక్టికల్స్ ఎక్టర్నల్స్ ఇంటర్నల్స్ మార్క్స్ లో మిమ్మల్ని ఇబ్బందులకు గురి చేస్తాము, మార్క్స్ వెయ్యమని బెదిరించి అలాగే తల్లిదండ్రులకు కూడా తప్పుడు మాటలు కొల్లబుల్ల మాటలు చెప్పి విద్యార్థులపైనే నిందలు వేస్తున్నారని తెలిపారు. కావున విద్యార్థులకు న్యాయం చేసేలా చూడాలని కోరారు.

సూర్య

మంగళవారం | 03 డిసెంబరు 2024

# పీఎం జన్మం స్కీమ్ వేగవంతం చేయండి



గృహాలను పరిశీలిస్తున్న డిఈ విజయబాబు

**చాగలమర్రి, మేజర్ న్యూస్ :** చాగలమర్రి మండల పరిధిలోని డి.వనిపెంట చెంచుగూడెంలో ప్రధానమంత్రి జన్మాన్ గృహాలు వేగవంతం చేయాలని ఆళ్లగడ్డ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయబాబు కోరారు. సోమవారం చాగలమరి మండలం డి.వనిపెంట గ్రామంలో ఉన్న చెంచుగూడెం నందు పిఎం జన్మన్ స్కీముకు సంబంధించిన అందరు బెనిఫిషర్లను డోర్ టు డోర్ కలవడం జరిగింది. వెంటనే ఇండ్లను మొదలు పెట్టాలని ఈ స్కీము కు సంబంధించిన బిల్లులు ఎప్పటికప్పుడు జమ అవుతాయని లబ్ధిదారులకు భరోసా కల్పించడం జరిగింది. అదేవిధంగా అదే గ్రామంలో ఉన్న పీఎంఏవై అర్బన్‌కి సంబంధించి లబ్ధిదారులను కలిసి వారికి మోటివేషన్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం నందు ఆళ్లగడ్డ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వారితోపాటు అసిస్టెంట్ ఇంజనీర్, నరసింహారా వు,వర్క్ ఇన్స్పెక్టర్, ఓబులేసు ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు ఉన్నారు.

## ప్రతి దరఖాస్తును పరిశీలించి పరిష్కరిస్తాం-తహశీల్దార్ శ్రీనివాసరెడ్డి

-ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఆరు దరఖాస్తులు



ప్రజలనుండి దరఖాస్తులను స్వీకరిస్తున్న తహశీల్దార్ శ్రీనివాసరెడ్డి

**సి.బెలగల్ మేజర్ న్యూస్ :** మండలంలో తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఆరు దరఖాస్తులు వచ్చాయని తహశీల్దార్ తెలిపారు. భూమీ ఆన్లైన్ కోసం నాలుగు దరఖాస్తులు రాగా, రీ సర్వేలో దొర్లిన తప్పుల గురించి రెండు దరఖాస్తులు వచ్చాయని, వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి పరిష్కరిస్తామని తహశీల్దార్ శ్రీనివాస రెడ్డి తెలిపారు.

## సైబర్ నేరాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలి




మాట్లాడుతున్న ప్రిన్సిపల్ వేణుగోపాల్

**కోవెలకుంట్ల, మేజర్‌న్యూస్ :** సైబర్ నేరాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ అన్నారు. స్థానిక డిగ్రీ కళాశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ అపరిచితులు పంపిన లింక్‌లు తెరవ కుండా డిలీట్ చేయాలని, ఎవరైనా ఫోన్ ద్వారా బెదిరింపులకు పాల్పడితే ధైర్యంగా కళాశాలలో కానీ, పోలీస్ స్టేషన్‌లో కానీ ఫిర్యాదు చేయాలని అన్నారు. ఎవరైనా నేరగాళ్ళు సైబర్ బెదిరింపులకు పాల్పడితే అత్యంత కఠిన శిక్షలు ఉన్నాయని అన్నారు. విద్యార్థులు వాటి గురించి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది అరికట్ల మల్లికార్జునరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ వెంకటేశ్వరరెడ్డి, అద్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## లోకేశ్వర రెడ్డిని పరామర్శించిన బి.సి రాజారెడ్డి



లోకేశ్వర రెడ్డిని పరామర్శిస్తున్న బి.సి రాజారెడ్డి

**బనగానపల్లెమేజర్,న్యూస్ః** బనగానపల్లె మండల పరిధిలోని మీరాపురం గ్రామానికి చెందిన టీడీపీ వాణిజ్య విభాగం నియోజకవర్గ అధ్యక్షులు ఆర్.సి నాగిరెడ్డి కుమారుడు లోకేశ్వర రెడ్డిని మాజీ సర్పంచ్ బి.సి రాజారెడ్డి పరామర్శించారు. లోకేశ్వర రెడ్డి, ఇటీవల మోటారు సైకిల్ ప్రమాదంలో గాయపడి నంద్యాల ప్రవేటు ఆసుపత్రిలో చికిత్స తీసుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న బి.సి రాజారెడ్డి సోమవారం ఉదయం మీరాపురం నుండి లోకేశ్వర రెడ్డిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి




**వెల్దుర్తి, మేజర్‌న్యూస్ః** ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులపై ఒత్తిడి చేయడం వలన పిలల్ని మందలించడం వలన పిల్లలు బడికి వెళ్ళకపోడం వలన తల్లిదండ్రులు బడికి పోతున్నావా లేదా అని మందలించడంతో ఓ విద్యార్థి మందు తాగి చనిపోవడం చాలా బాధాకరమని ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు టి.కృష్ణ, మండల నాయకులు సుధీర్‌లు అన్నారు. సోమవారం స్థానిక సిపిఐ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పాఠశాలకు వెళ్ళడానికి ఒక విద్యార్థి ఎంత మనస్థాపడ్డాడో, ఆ వయస్సులో కూడా స్కూల్‌లో ఏం జరుగుతుంది, విద్యార్థినీ వేధిస్తున్నారా లేదంటే విద్యార్థినీ కొడుతున్నారా అని అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. వీటిపై పూర్తిగా సమగ్ర విచారణ జరిపించి పద్మ విద్య వికాస్ స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని, ఇలాంటి ఘటనలు ఏ పాఠశాల యందు పునరావృతం కాకూడన్నారు. మండలంలో ఇద్దరు ఎంఈఓలు ఉన్నా కూడా ఏ ప్రైవేట్ ప్రభుత్వ పాఠశాలలకు వెళ్ళకుండా పరిశీలించకుండా నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# టీడీపీలో చేరిన పెద్దకటికే వ్యాపారస్తులు

**ఎవరిని బెదిరించి పార్టీలోకి తీసుకోవాల్సిన అవసరం లేదు :- ఎమ్మెల్యే బీవీ**

**స్వచ్ఛందంగా పార్టీలకు వస్తున్నాం - వ్యాపారస్తులు**

**పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ పని చేయాలి**



ఎమ్మెల్యే బీవీ సమక్షంలో టీడీపీలో చేరుతున్న దృశ్యం

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన పెద్దకటికే వ్యాపారస్తులు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వరరెడ్డి సమక్షంలో పెద్దకటికే వ్యాపారస్తులు ఇబ్రహీం, బందే నవాజ్, రహంతుల్లా, ఇలియాస్, జాకీర్, సత్తార్ లతోపాటువారిఅనుచరులు దాదాపు 300మంది టీడీపీలో చేరారు. పెద్ద కటిక వీధి నుంచి భారీ ర్యాలీగా వచ్చారు. ముందుగా ఎమ్మెల్యే బీవీకి పెద్దకటికే వ్యాపారస్తులు భారీ గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ముందుగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ.. ఎవరు ఎలాంటి బెదిరింపులు ప్రలోభాలు పెట్టలేదని తాము స్వచ్ఛందంగా ఎమ్మెల్యే బీవీ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరుతున్నట్లు పెద్దకటికే వ్యాపారస్తులు తెలిపారు. పట్టణ అభివృద్ధికి, పార్టీ బలోపేతానికి తాము మద్దతుగా నిలిచేందుకు పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. అనంతరం ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ రాజకీయాలు ఎన్నికల ముందు ఉంటాయి ఇప్పుడు రాజకీయాలు చేయాల్సిన అవసరం ఎవరికి లేదన్నారు. పార్టీ బలోపేతానికి అభివృద్ధికి సహకరించినందుకు పెద్దకటికే వ్యాపారస్తులు పార్టీలోకి వస్తున్నారని, ఎవరిని బెదిరించి పార్టీలోకి తీసుకోవాల్సిన అవసరం లేదన్నారు. కొందరు వైసీపీ నాయకులు అసత్య ఆరోపణలు చేయడం సిగ్గుచేటు అన్నారు. పెద్దకటికే వారికి స్లాట్ హౌస్ 2014లో మంజూరు చేయించడం జరిగిందని దాన్ని వైసిపి పట్టించుకోకుండా గాలికి వదిలేసిందన్నారు. గతంలో మంజూరు చేసిన పనులు సక్రమంగా చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. ఈరోజు అభివృద్ధికి సహకరించి పార్టీలో వస్తున్నారని ఇందుకు కొంతమంది అనవసర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో నా తండ్రి బివి మోహన్ రెడ్డి గారికి వీరికి అనుబంధం ఉందని కొత్త ఎవరు కాదన్నారు. పదవులకు ఆశించి ఎవరు పార్టీలోకి రావడంలేదని పార్టీ బలోపేతం కోసంముందుకు వస్తున్నారు. అన్ని వర్గాలకు పట్టణంలోని ఉన్న ప్రతి వ్యాపారస్తులకు బీవీ కుటుంబం అండగానిలుస్తుంది అన్నారు. ప్రతివ్యాపారి బ్రహ్మాండంగా వ్యాపారం చేసుకునే విధంగా చర్యలు చేపట్టామన్నారు. కటిక కులస్తులకు ఖురేషి భవన్ పెట్టాలని నిర్ణయాన్ని తీసుకుంటామన్నారు. ప్రతి కటికే వర్గానికి అండగా నిలుస్తామని బీవీ స్పష్టం చేశారు. ప్రతి వ్యాపారస్తులను ఇబ్బంది పెట్టే కార్యక్రమాలు ఎవరు చేయాల్సిన అవసరం లేదన్నారు. స్వేచ్ఛగా వ్యాపారస్తులు వ్యాపారం చేసుకోవాలని, చేపట్టబోయే శాశ్వత పనులు ద్వారా శాశ్వతంగా నిలుస్తాయన్నారు. పార్టీలో చేరిన వారు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బందే నవాజ్, ఫారుక్, గట్టు అల్తాఫ్, దాదాసాహెబ్, అమనుల్లా, ఇషాక్, గుల్లా సలాం, జహంగీర్, సలీమ్, షాబీర్ తదితరులు పాల్గొన్నారు.

# మిర్చి రైతులకు తుఫాన్ గండం



ఆరుబయల ఆరబోసుకున్న మిరప పంట

**గోనెగండ్ల,మేజర్ న్యూస్ :** గోనెగండ్ల మండల పరిధిలో రబీలో సాగు చేసుకున్న మిర్చి పంట ఇప్పుడు చేతికి అందేసమయం అయితే గత నాలుగు రోజులుగా తుఫాన్ గండం రైతులకు కంటి మీద కునుకు లేకుండ చేస్తుంది. గోనెగండ్ల మండలంలో కులుమాల, అలువాల, చిన్నమరివీడు, గాజులదిన్నె, హెచ్ కైరవాడి, పుట్టపాశం, వేముగోడు గ్రామాలతో పాటు మరికొన్ని గ్రామాలలో వి రప పంట ను అధికంగా సాగు చేశారు. సుమారు రెండువేల ఎకరాలలో సాగు అయినట్లు తెలుస్తుంది. పంట ఆశాజనకంగా ఉంది. ప్రస్తుతం పంట కోత చేపడుతున్నారు. దిగ బడిని పంట పొలాలలోనే అరబెట్టి ఆయా మార్కెట్‌కు తరలించేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. రెండు మూడు రోజులుగా రాష్ట్రంలో వాయుగుండ ప్రభావం కారణంగా ఎండ కనిపించడం లేదు. మంచు కురుస్తుండటంతో మిర్చి దిగుబడి దెబ్బతిని ధరలపై తీవ్ర ప్రభావం పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మంచు కరుస్తున్న కారణంగా టార్పలిన్తో కప్పి ఉంచడం వల్ల పంట మగ్గి పోయి రంగు మారిపోతుందని రైతులు వాపోతున్నారు. తుఫాన్ రూపంలో మరోసారి నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

## ఉరుసు మహోత్సవ గోడపత్రిక ఆవిష్కరించిన మంత్రి బి.సి



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న మంత్రి బి.సి

**బనగానపల్లెమేజర్,న్యూస్ః** బనగానపల్లె పట్టణంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా ముస్లీం మైనార్టీ సోదరులు నిర్వహించుకునే గంధం, ఉరుసు మహోత్సవ ఆహ్వాన పత్రికను రాష్ట్ర రోడ్లు మరియు భవనాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి చేతులమీదుగా ఆవిష్కరించడం జరిగింది. పట్టణంలోని పాతబస్టాండు వద్ద 23వ తేదీ గంధం, ఉరుసు కార్యక్రమానికి మంత్రి బి.సిని నిర్వాహకులు ఆహ్వానించారు. కార్యక్రమానికి మంత్రి ఆర్థికంగా అండగా నిలుస్తూ వస్తున్నారని కమిటీ నేతలు సంతోషం వ్యక్తం చేశారు. ఖవ్వాలి కార్యక్రమం కోసం లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అక్బర్ హుసేన్, కమిటీ ప్రెసిడెంట్ బురానుద్దీన్, కన్వీనర్ ఫరూక్, వైస్ ప్రెసిడెంట్ జాఫర్, చిన్న బాష , అహ్మద్ హుసేన్, రఫీ, మరియు ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## 1620 కేజీల నల్ల బెల్లం స్వాధీనం..

షాపు ఓనర్, ఇద్దరు మైనర్లపై కేసు నమోదు

**కర్నూల్ క్రైమ్ మేజర్ న్యూస్:** పట్టణంలోని సి.క్యాంపులో వాహనాలు తనిఖీలు నిర్వహిస్తుండగా అక్రమంగా నల్లబెల్లం తరలిస్తున్న ఇద్దరు మైనర్ బాలురులను అదుపులోకి తీసుకొని వారిచ్చిన సమాచారం మేరకు షాపుఓనర్‌ను అరెస్టుచేసినట్లు మూడవపట్టణ ఎస్సై.మన్మధ విజయ్ తెలిపారు.ఎస్సైతెలిపిన వివరాల మేరకు..కర్నూల్ మూడవ పట్టణ పోలీస్ స్టేషన్ సిఐ ఉత్తర్వుల మేరకు మూడవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న సి.క్యాంపు సెంటర్‌లో ఎస్సై.జె. మన్మధ విజయ్ తన సిబ్బందితో సోమవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక మోటార్ సైకిల్ పైన ఇద్దరు వ్యక్తులు వారి చేతులలో ప్లాస్టిక్ సంచులతో వస్తు పోలీస్ చూసి పారిపోవడానికి ప్రయత్నించారని, ఎస్సై తన సిబ్బందితో పారిపోతున్న వారిని పట్టుకొని విచారించగా వారిద్దరూ మైనర్ బాలురులని తెలిసిందని వారిద్దరు వెల్దుర్తి మండలం పులగుమ్మి గ్రామం వాసులని తెలిపారన్నారు. వారి చేతులలో ఉన్న సంచులను చూడగా నాటు సారాయి కలిగిన 20 లీటర్ల ప్లాస్టిక్ క్యాన్లు మరియు 40 కేజీల బెల్లంలభించింది. ఈ నాటు సారాయి ఎక్కడిది అనివారిని పోలీసులు విచారించగా మొదటిబాలుడి తండ్రి అయిన బోయ సుంకన్న చెప్పగా వారిద్దరూ కర్నూల్‌కు వచ్చి ఇక్కడ సారాయి అమ్ముతున్నామని మరియు ఇక్కడ నుండి బెల్లం కొనుక్కొని వెళ్లి మా గ్రామంలో నాటు సారాయి తయారికి తీసుకొని వెళుతున్నాము అని ఆ మైనర్ బాలురులు సమాధానం చెప్పారు. అంతటా ఈ బెల్లం ఎక్కడిది అని విచారించగా పట్టణంలోని వన్ టౌన్‌కు చెందిన రాజశేఖర్ వద్ద కొనుగోలు చేసినాము అని బదులిచ్చారు.వారు ఇచ్చిన సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో వెళ్లి వారు తెలిపిన షాపును తనిఖీ చేయగా షాపులో 1620 కెజీల సారాయికి ఉపయోగించే బెల్లం లభించిందని తెలిపారు.దీంతో ఎస్సై సదరు షాపును సీజ్ చేసి షాపులో ఉన్న బెల్లాన్ని మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం షాపు ఓనర్ రాజశేఖర్ మరియు ఇద్దరు మైనర్ బాలురులను అదుపులోకి తీసుకొని వారిపైన కేసు నమోదుచేయడం జరిగిందని ఎస్సై తెలిపారు.

## మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి


ఎమ్మెల్యే బీవీకి వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు ఎమ్మెల్యే బీవీ. జయ నాగేశ్వరరెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు నర్సప్ప, నారాయణ, మధుబాబు, కన్నాలు మాట్లాడుతూ గత 30 ఏళ్ల నుండి మున్సిపల్ కార్మికులు ఎటువంటి ప్రయోజనాలు లేకుండా, జీతాలు పెంచకుండా, మరొక రాష్ట్ర ప్రభుత్వం నుండి సంక్షేమ పథకాలుఅందకుండా చాలాఇబ్బంది పడుతున్నామని వాపోయారు. మా న్యాయమను డిమాండ్లు ఈనెల 8వతేదీ లోపు పరిష్కరించాలని లేనిపక్షంలో వరుసటి రోజు నుండి సమ్మె బాట తప్పదన్నారు. ఇంజనీరింగ్ విభాగంకు సంబంధించిన నీటి సరఫరా, వీధి దీపాలు, ఇతర వాటిని కూడా ఆపివేస్తామని హెచ్చరించారు. జరగబోయే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని వారు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికైనా కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు ఈరన్న, రఘు, రాజు, మోదీన్, జిలాన్ జమీల్ జహీర్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపట్ల తస్మాత్ జాగ్రత..!

**సి.బెలగల్ క్రైమ్ న్యూస్ :** నేటి కంప్యూటర్ యుగంలో మోసాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. నిత్యం సైబర్ నేరగాళ్ల ఉచ్చులో యువత, ఉద్యోగస్తులు, వ్యాపారవేత్తలు, అడ మగ అని తేడా లేకుండా మోసపోతున్నారు. అందులో భాగంగా రాష్ట్ర సైబర్ క్రైమ్ అధికారుల ఆదేశాలమేరకు మండలంలో స్థానిక ఎస్ఐ. తమ్మారెడ్డి మండల ప్రజలను ఉద్దేశించి ఆన్లైన్ మోసాలకు, సైబర్ మోసాలకు ప్రతి ఒక్కరు దూరంగా ఉండాలని సూచించారు. ముందుగా వ్యక్తిగత సమాచారం గోప్యత అవసరం, సులభంగా పొందవచ్చని ఆన్లైన్ రుణాలకు ఆశపడి లింక్,పాస్వర్డ్, ఓటీపి వంటి సమాచారం చెప్పవద్దు, తెలియని వ్యక్తులనుండి వచ్చిన వీడియో కాల్ లిఫ్ట్ చెయ్యవద్దు, నగ్నంగా వుండి కాల్ రికార్డింగ్ చేసి పోలీసు కేసులు పెడతామని బ్లాక్ మెయి ల్ బెదిరింపులకు పాల్పడతారు, లక్కీడిప్ ద్వారా డబ్బు గెలుచుకొన్నారని కొంత డబ్బు డిపాజిట్ చేస్తే గెలిచిన డబ్బు మీ అకౌంట్కు బదిలీ చేస్తామని ఫోన్ ద్వారా వచ్చే కాల్స్ ను నమ్మకండి, మీ క్రెడిట్ కార్డు, ఏటీఎం కార్డ్ బ్లాక్ అవుతుందని మీ పంపిన ఫైల్ ను ఓపెన్ చేయమని వచ్చే కాల్స్ పట్ల జాగ్రత వుండాలని, మీ క్రెడిట్ కార్డు, ఏటీఎం కార్డుల పాస్వర్డ్ ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవాలి, ఫేస్ బుక్, ఇన్స్టాగ్రామ్ ఖాతాలలో మనకు తెలిసి వారి ప్రొఫైల్తో మోసాలకు పాల్పడి డబ్బులు ఆడుతారు అందుకు వాటిపట్ల చాలా జాగ్రత అవసరమన్నారు. యువత అత్యధికంగా ఆన్లైన్ జాబ్ అని, వర్క్ ఫ్రం హెూం అని వీడియోలు చెర్ చేయడం, రివ్యూలు ఇవ్వడం ద్వారా అధిక మొత్తంలో డబ్బు వస్తుంది అధిక మొత్తంలో డబ్బు ఆశ డబ్బులు లాగుతారని, స్టాక్ మార్కెట్ పై పెట్టుబడి అని నకిలీ వెబ్ సైట్స్ ద్వారా మోసాలకు పల్పడుతారని అందుకు పెరుగుతున్న సైబర్ మోసాలపట్ల ప్రతి ఒక్కరు దూరంగా వుండి జాగ్రతగా వుండాలని, విలువైన సంపద,సమాచారం, నష్టపోవడానికి మోసపోవడాని ప్రధాన కారణాలు అత్యాశ, అశ్రద్ధ, వ్యామోహామని ఎస్ఐ.తిమ్మారెడ్డి తెలిపారు.


మండల ఎస్ఐ.తిమ్మా రెడ్డి

## పల్లెల్లో సాగునీటి సంఘాల ఎన్నికల వేడి

- అభ్యర్థులను ప్రకటించి ముందంజలో ఉన్న టీడీపీ
- పోటీకి సిద్ధమవుతున్న వైసీపీ
- ఇరు పార్టీలలో అసంతృప్తి నాయకులను బుజ్జగించే యత్నాలు


గాజులదిన్నె ప్రాజెక్టు

**గోనెగండ్ల,మేజర్ న్యూస్ :** పల్లెల్లో సాగునీటి సంఘాల ఎన్నికల వేడి రాసుకుంది. గ్రామాలలో తమ వర్గంకు చెందిన వాడే సంఘం అధ్యక్షుడు కావలని కార్యకర్తలు నాయకులు తమ అధిష్టానం వద్ద పోటీ పడుతున్నారు. ఇప్పటికే సాగునీటి సంఘాల ఎన్నికలకు గాను స్థానిక ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి టీడీపీ తరుపున పోటీ చేసే డబ్ల్యుఏ ప్రెసిడెంట్లను, టీసీ మెంబర్లను దాదాపు పేర్లను ఖరారు చేశారు. అయితే వైసీపీ నాయకులు కూడా ప్రతి సాగునీటి సంఘానికి పోటీ చేసేందుకు ముమ్మర ప్రయాత్నాలు చేస్తుంది. ఆ పార్టీ నాయకలు వైసీపీ కార్యాకర్తలతో సమాలోచనలు జరుపుతున్నారు. గెలుపు ఓటములు దైవాదీనం పోటీ చేస్తామని ఆ పార్టీ నాయకులు తెలుపుతున్నారు. గోనెగండ్ల మండలంలో ఎల్లెల్సీ కింద మూడు డబ్ల్యుఏ ప్రెసిడెంట్లు ఉన్నాయి. అలాగే గాజులదిన్నె ప్రాజెక్టు కింద ఎమ్మిగనూరు, కోడుమూరు, పత్తికొండ, డోన్ నియోజకవర్గాలలోని గ్రామాల నుంచి 12 డబ్ల్యుఏ ప్రెసిడెంట్లు 144 టీసీ మెంబర్లు ఉన్నాయి. కాగా ఎమ్మిగనూరు నియోజకవర్గం నుంచి ఐదు డబ్ల్యు ఏ ప్రెసిడెంట్ లు ఉన్నాయి. ఎమ్మిగనూరు నియోజకవర్గం కు చెందిన ఈ డబ్ల్యుఏ ప్రెసిడెండ్లలకు ఎమ్మెల్యే బీవీ పేరు ఖరారు చేశారు. ఇక వైసీపీ నాయకులు కూడా దీటు గా ఎదుర్కొవాలని ప్రయత్నాలు చేస్తున్నారు. టీడీపీ నుంచి ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆశీస్సులు ఉన్నవారే గెలుపొందే అవకాశాలు ఉన్నాయి. ఇక ఈ సాగు నీటి సంఘాల ఎన్నికల పట్ల మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి అంతగా ఆసక్తి చూపడం లేదని వైసీపీ నాయకులే అంటున్నారు. ఇక బుట్టారేణుక తో మాట్లాడి నేడోరేపో తమ అభ్యర్థులను పేరు ప్రకటిస్తామని మండల వైసీపీ నాయకులు తెలుపుతున్నారు. ఈనెల 8వ తేదిన ఎల్లెల్సీ సాగునీటి సంఘాలకు గోనెగండ్ల ఎంపీడీవో కార్యాలయం, టీబీపీ కార్యాలయంలో ఎన్నికలు జరుతాయి. అలాగే గాజులదిన్నె సాగునీటి సంఘాలకు గాజులదిన్నె ప్రాజెక్ట్ ఇరిగేషన్ కార్యాలయం ఎన్నికలు జరుతున్నట్లు అధికారులు తెలిపారు.

## చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై పోలీసు డ్రోన్ కెమెరాతో గట్టి నిఘా

**కర్నూలు క్రైం,మేజర్ న్యూస్ :** జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఆదేశాల మేరకు కర్నూలు డిఎస్పీ జె.బాబు ప్రసాద్ ఆధ్వర్యంలో కర్నూలు పట్టణంలో నేర నివారణే లక్ష్యంగా పోలీసులు విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నారు. ఈ సంధర్బంగా సోమవారం జిల్లా కేంద్రంలోని కర్నూలు నాల్గవ పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని వీకర్ సెక్షన్ కాలనీ, శరీన్ నగర్ , ముజఫర్ నగర్ సమస్యాత్మక ప్రదేశాలలో చట్ట వ్యతిరేక కార్యకలాపాల పై డ్రోన్ కెమెరా ద్వారా గట్టి నిఘా ఉంచారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 18 మందిని కర్నూలు ట్రాఫిక్ పోలీసులు, కర్నూలు నాల్గవ పట్టణ పోలీసులు, ఫ్యాక్షన్ జోన్ పోలీసులు కలిసి అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు. చట్టవ్యతిరేక కార్యకలాపాల పై,బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారి పై నిరంతరం పర్యవేక్షణ నిఘా కొనసాగుతుందని పోలీసు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ట్రాఫిక్ సిఐ మన్సురుద్దీన్, కర్నూలు ఫ్యాక్షన్ జోన్ సిఐ పవన్ కుమార్, కర్నూలు నాల్గవ పట్టణ ఎస్సై గోపినాథ్, ట్రాఫిక్ ఆర్ ఎస్సై హుస్సేన్ పాల్గొన్నారు.



డ్రోన్ కెమెరాతో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

## సిద్ధార్థనాయుడు పుట్టినరోజు సందర్భంగా పేదలకు అన్నదానం


ఉచిత భోజనాలు వడ్డిస్తున్న 19వ వార్డు టిడిపి ఇంచార్జ్ శ్రీనివాస్ ఆచారి

**ఆదోని టౌన్, మేజర్ న్యూస్:** తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు సిద్ధార్థనాయుడు 32వ పుట్టినరోజు సందర్భంగా.. 19వ వార్డు టిడిపి ఇంచార్జ్ శ్రీనివాస్ ఆచారి ఆధ్వర్యంలో సోమవారం ఆదోని పట్టణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక అన్నా క్యాంటీన్ లో పేదలకు, నిరాశ్రయులకు ఉచితంగా భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ ఆచారి మాట్లాడుతూ తమ అభిమాన నాయకుడు జన్మదినాన్ని పురస్కరించుకొని పేదలకు అన్నదానం చేయడం నిజంగా తన అదృష్టమని పేర్కొన్నారు. ఏమి పెట్టి కొనుక్కున్న ఇలాంటి ఆనందం సంతృప్తి దొరకదని తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిష్ రవి, నరేంద్ర, సునీల్, సంధ్యారాణి, వెంకటేష్, రెహమాన్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా భారతి పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికారిక సంస్థ, చైతన్య కశ్యప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలోక్రీడా భారతి పురస్కారాలు అందించేందుకు డిసెంబరు8వ తేదీన క్రీడా జ్ఞాన పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాప్రాధికారిక సంస్థ అధికారి ఎం ఎన్ వి రాజు తెలిపారు. దీనికోసం 12 సంవత్సరాల వయస్సు దాటిన వారందరూదరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి ఉన్న వారు kreedabharathi.org వెబ్ సైట్లో దరఖాస్తులు అప్లోడ్చేయాలన్నారు. మొదటి బహుమతి రూ. లక్ష, రెండవబహుమతి ఇద్దరికి రూ.50వేల చొప్పున మూడోబహుమతి రూ.25 వేల చొప్పున ఆరుగురికి, నాల్గవబహుమతి రూ. 11 వేల చొప్పున 11 మందికిఅందజేస్తారన్నారు. పరీక్ష ఆన్లైన్లో నిర్వహించడంజరుగుతుందని, దీనిలో 50 ప్రశ్నలు ఉంటాయన్నారు.25 నిమిషాల పాటు పరీక్ష జరుగుతుందన్నారు. ఆసక్తి గల జిల్లాలోని క్రీడాకారులు,విద్యార్థులు,పౌరులు 8న జరగనున్న ఆన్లైన్ క్రీడా జ్ఞాన పరీక్ష కు రిజిస్టర్ కావాలని ప్రకటనలో కోరారు.

## శివాలయంలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పూజలు





**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన రుద్రవరం శివాలయంలో సోమవారం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఆలయం వద్దకు చేరుకోగానే అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో కొలువుదిరిన పరమ శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రుద్రవరం మండల టిడిపి నాయకులు ఆమెను సన్మానించారు.

## శ్రీశ్రీ పైరాయి ఆంజనేయస్వామిని దర్శించుకున్న టిడిపి నేతలు





**పెద్దకడుబూరు, మేజర్ న్యూస్ :** కార్తీకమాస మహోత్సవాలు సందర్భంగా పెద్దకడుబూరు మండల పరిధిలోని బసలదొడ్డి గ్రామానికి సమీపంలో వెలసిన శ్రీశ్రీపైరాయి అంజనేయు స్వామిని సోమవారం తెలుగుదేశం పార్టీ నాయకులు టిడిపి జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి తనయుడు తెలుగు యువత నాయకులు దివాకరరెడ్డి. అలాగే మండల కన్వీనర్ బసలదొడ్డి ఈరన్నలు స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే గ్రామ పెద్దలు దివాకరరెడ్డి, ఈరన్నకు శాలువలతో కప్పి ఘనంగా సన్మానించారు. అదే విధంగా శ్రీ సీతారాముల ఆలయానికి వెళ్లి సీతారాముల స్వామి వారని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో గ్రామ టిడిపి నాయకులు. కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## లష్కర్లకు రైన్ కోట్‌లు, టార్చ్ లైట్‌లు పంపిణీ

**గడివేముల మేజర్ న్యూస్:** గడివేముల మండలంలోని పెసర వాయి గ్రామానికి చెందిన రైతు దామోదర్ రెడ్డి కేసీ కెనాల్ లో పనిచేస్తున్న 9 మంది లస్కర్లకు రైన్ కోట్లను మరియు టార్చిలైట్లను పంపిణీ చేసినట్లు లష్కర్లు తెలిపారు. దాదాపు దీని విలువ 9,000 వేల రూపాయల వరకు ఉంటుందని లస్కర్లు తెలిపారు. ఈ సందర్భంగా లష్కర్లు మాట్లాడుతూ చలికాలంలో రైతు దామోదర్ రెడ్డి లష్కర్లకు రైన్ కోటు మరియు టార్చ్లైట్ పంపిణీ చేసినందు వల్ల రైతుకు లస్కర్లు కృతజ్ఞతలు తెలిపారు.



సూర్య

మంగళవారం | 03 డిసెంబర్ 2024

పంటల బీమా పథకంపై

# రైతులకు అవగాహన కల్పించాలి: జిల్లా కలెక్టర్

**కర్నూలు, మేజర్‌న్యూస్ ప్రతినిధి:** పంటల బీమా పథకంపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం సునయన ఆడిటోరియంలో పంటల బీమా పథకం 2024-25 పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎంఎఫ్‌బీవై కింద సెనగలు, జొన్న, వేరుసెనగ, ఉల్లి పంటలకు డిసెంబర్ 15వతేదీలోపు, వరి పంటకు డిసెంబర్ 31వతేదీలోపు ప్రీమియం చెల్లించాలన్నారు. రైతులు ఎకరానికి సెనగకు రూ.420లు, జొన్నకు రూ.297, వేరుసెగనకు రూ.480లు, ఉల్లిగడ్డకు రూ.1,350లు, వరి పంటకు ఎకరాకు రూ.630లు బీమా ప్రీమియం చెల్లించాలని కలెక్టర తెలిపారు. రుణం తీసుకోని రైతులు ఆధార్‌కార్డు, పొలానికి సంబంధించిన పత్రాలు, ఫోన్ నెంబరు, బ్యాంక్ పాస్‌బుక్ మొదటి పేజీలు సమర్పించి బీమా చేసుకోవాలన్నారు. బ్యాంకుల నుంచి రుణం రైతులకు తీసుకున్న



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రుణంలోనే ప్రీమియం మినహాయించుకొని రుణం ఇవ్వడం జరుగుతుందని ఆ రైతులు బీమా చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. బీమా ప్రీమియం, తేదీ వివరాలను రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జేసీ బి.నవ్య జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, టాటా ఏఐజీ ఇన్సూరెన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# కలెక్టర్ల సదస్సుకు నివేదికలు సిద్ధం చేయండి : కలెక్టర్

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** ఈనెల 10,11 తేదీలలో రాష్ట్ర ముఖ్యమంత్రి కలెక్టర్ల సమావేశానికి నివేదికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. డీఆర్వో రాము నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్వహించే కలెక్టర్ల సమావేశానికి సంబంధించి అన్ని పారా మీటర్లలో నిర్దేశిత లక్ష్యాన్ని సాధించేలా చర్యలు తీసుకుంటూ నివేదికలను అందజేయాలన్నారు. స్పెషల్ అధికారులు, మండల తహశీల్దార్లు, ఎంపీడీఓలు, సంక్షేమ హాస్టళ్ళను తనిఖీ చేసి పారిశుధ్య కార్యక్రమాలపై మున్సిపల్, పంచాయతీ అధికారులకు సూచనలు ఇవ్వాలన్నారు. నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల



జిల్లా కలెక్టర్ రాజకుమారి

ఆవరణంలో సోషల్ వెల్ఫేర్ హాస్టల్ భవనంలో మరుగుదొడ్ల నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఈడబ్లుఐడిసి ఇంజనీర్‌ను కలెక్టర్ ఆదేశంచారు. జిల్లాలోని 139 ఇంటర్ కళాశాలల్లో 5,861 మంది విద్యార్థులలో 2,252 మంది విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణులయ్యారని తక్కువ శాతంతో పాస్ కావడానికి కారణాలను డివిఈఓను కలెక్టర్ ప్రశ్నించారు. మంగళవారం సాయంత్రం 4గంటలకు కళాశాల ప్రిన్సిపాళ్ళతో సమావేశం ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అపార్ ఐడి ఎన్‌రోల్‌మెంట్ శుక్రవారం లోగా 80శాతం పూర్తి చేయాలని విద్యాశాఖాధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈనెల 7వ తేదీన మెగా పేరెంట్ టీచర్స్ సమావేశాఇకి పటిష్ట ప్రణాళిక రూపొందించుకుని ఆ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. రబీ పంటకు సంబంధించి ఈ క్రాప్ ఇన్సూరెన్స్ పూర్తి చేయాలన్నారు.

శ్రీశైలంలో ముగిసిన

## కార్తీకమాస శివచతుస్సప్తాహ భజనలు



**శ్రీశైలం, మేజర్ న్యూస్:** లోక కల్యాణం కోసం కార్తిక మాసమంతా శ్రీశైల దేవస్థానంలో నిర్వహించిన శివచతుస్సప్తాహ భజనలు సోమవారంతో ముగిసాయి.కార్తిక మాసమంత నిరంతరంగా రేయింబవళ్ళు అఖండ శివపంచాక్షరి నామభజనను చేయటం జరిగింది. ఈ భజనలలో కర్నూలు జిల్లాకు చెందిన రెండు భజన బృందాలకు, కర్ణాటకకు చెందిన నాలుగు భజన బృందాలకు అవకాశం కల్పించారు. శ్రీ గురునిమిషాంబదేవి భజన మండలి(కర్నూలు), శ్రీ చెన్నకేశవ నాటక కళాభజన మండలి (కర్నూలు), శ్రీశైలమల్లికార్జున భజన సంఘం, బళ్ళారి, కర్ణాటక రాష్ట్రం, శ్రీ మౌళీ బసవేశ్వర భజన సంఘ్, గోపనదేవరహళ్ళి, రాయచూర్ జిల్లా,శ్రీ మల్లికార్జున భజన మండలి, సుమ్మేశ్వారాహాల్, రాయచూర్ జిల్లా, కర్ణాటక, శ్రీ ప్రభులింగ సేవా సంఘ్, గోపానదేవరహళ్ళి, రాయచూర్ వారు భజనల్లో పాల్గొన్నారు. ఈ ముగింపు పూజ కార్యక్రమంలో ఈవో ఎస్.ఎస్.చంద్రశేఖర ఆజాద్, అర్చక స్వాములు తదితరులు వున్నారు.



మహానంది క్షేత్రంలో వైస్ ఛాన్సలర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

మహానంది క్షేత్రంలో

## వైస్ ఛాన్సలర్ పూజలు

**మహానంది, మేజర్‌న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహానందిలో రాయలసీమ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ఎన్‌టీకే నాయక్, ఎక్జామ్ కంట్రోలర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు పూజలు నిర్వహించారు. క్షేత్రానికి వచ్చిన వీరికి ఆలయ మర్యాదలతో పర్యవేక్షకులు శశిధర్‌రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం వారు శ్రీ కామేశ్వరి సమేత మహానందీశ్వర స్వామివార్లకు అభిషేకార్చనలు నిర్వహించారు. వేదపండితులు ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేయగా అధికారులు శేషవస్త్రం, జ్ఞాపికతో సత్కరించారు. వీరి వెంట రామకృష్ణా విద్యాసంస్థల అధినేత గడ్డం రామకృష్ణారెడ్డి ఉన్నారు.

# విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం

## - జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్:** ప్రజా ఫిర్యాదుల పరిష్కారవ వేదిక ద్వారా వచ్చిన అర్జీలపై విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తామని జిల్లా ఎసీ జి.బిందుమాధవ్ అన్నారు. సోమవారం నగరంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయలలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేది కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మొత్తం ఈ కార్యక్రమానికి 94ఫిర్యాదులు వచ్చాయి. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు, సీఐ ఇబ్రహీం పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ జి.బిందుమాధవ్

# చట్ట పరిధిలో ఫిర్యాదులను పరిష్కరించాలి

## - జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా



ఫిర్యాదురాలితో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

**నంద్యాల క్రైం, మేజర్‌న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కార వేధిక కార్యక్రమంలో ఫిర్యాదుదారులు అందించే ఫిర్యాదులను చట్ట పరిధిలో పరిష్కరించి వారికి సత్వరమే న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా అదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేధిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఫిర్యాదుదారుల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి 90 మంది తమ ఫిర్యాదులను అందించారు. ఫిర్యాదుల్లో ప్రధానంగా సివిల్ తగాదాలు, కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, అన్నదమ్ముల ఆస్థి పంపకాల్లో తగాదాలు ఉన్నాయి. ఈ సందర్భంగా ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి వారి సమస్యలను పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ పేర్కొన్నారు. ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని, చట్ట పరిధిలో సమస్యలు సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ యుగంధర్‌బాబు, సీఐలు మోహన్‌రెడ్డి, జయరాములు పాల్గొన్నారు.

టికెట్ల గోల్‌మాల్‌పై

## విజిలెన్స్ అధికారులు పరిశీలన

**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది పుణ్య క్షేత్రంలో గత 15 రోజుల క్రితం టికెట్ల గోల్‌మాల్ జరిగిన విషయం విధితమే. దీనిపై కర్నూలు విజిలెన్స్ ఎస్పీ చౌడేశ్వరి దేవి, డీఈ చంద్రశేఖర్‌రెడ్డిలు సోమవారం తనిఖీలు చేశారు. కార్యాలయానికి చేరుకొని పలు రికార్డులను పరిశీలించారు. టికెట్ల జారీ విషయంలో జరిగిన గోల్‌మాల్‌పై సిబ్బందితో ఆరా తీశారు. ఈవో స్థానికంగా లేకపోవడంతో పూర్తి స్థాయి విచారణకు మరలా వస్తామని తెలిపారు. అనంతరం మహానంది పుణ్య క్షేత్రంలో వారు పూజలు నిర్వహించారు. వేదపండితులు ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేయగా ఏఈవో మధు జ్ఞాపికతో సత్కరించారు.



మహానంది క్షేత్రంలో విజిలెన్స్ అధికారులను సత్కరిస్తున్న దృశ్యాలు



మహానంది క్షేత్రంలో విజిలెన్స్ అధికారులను సత్కరిస్తున్న దృశ్యాలు

తూకాలలో జరిగే మోసాల నుంచి

# రైతులను కాపాడండి : రైతులు

**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్ :** పూలను పండించి, వాటిని మార్కెట్‌లో విక్రయించడానికి వచ్చిన రైతులను పూలమార్కెట్‌లో వ్యాపారం చేసే వ్యాపరస్తులు తూకాలలో మమ్ములను మోసం చేస్తున్నారని, ఆరుగాలం కష్టించి పూల తోటలను సాగు చేసి, జీవిస్తున్న మమ్ములను తూకాలలో జరిగే మోసాల నుండి, పూల వ్యాపారస్తులు చేసే మోసాల నుండి రైతులను కాపాడాలని రైతులు వాపోయారు. ఈ సందర్భంగా సోమవారం పట్టణంలోని తూనికలు, కొలతలు కార్యాలయం వద్ద డోన్ మండలంలోని ధర్మవరం, గోసానపల్లె, చింతలపేట, కొచ్చెర్వు, కన్నపుకుంట, ఎర్రగుంట్ల, మల్కాపురం, రంగాపురం, యు.కొత్తపల్లె, ఉంగరానిగుండ్ల, ప్యాపిలి మండలంలోని హుస్సేనాపురం, చంద్రపల్లె, సిద్దనగట్టు, బాయిపల్లె, గోపాలనగరం, ఊటకొండ, జలదుర్గం, మాదారం, రామకృష్ణాపురం, పూలరైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా పూల రైతులు మాట్లాడుతూ మా పొలాలలో పండించిన పూలను డోన్ పట్టణంలోని



తూనికలు, కొలతలు కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న పూల రైతులు

పూలమార్కెట్‌కు తీసుకొని వచ్చి విక్రయిస్తున్నామని, అయితే పూల మార్కెట్‌లో కమీషన్ షాపుల వారు సరైన తూకం వేయకుండా చేతి గొలుసు కాటతో తూకం వేసి రెండు కేజీలు వచ్చే పూలను ఒక కేజి చూపుతూ పూల రైతులను మోసం చేస్తున్నారని, మేము పండించిన పూలకు సరైన తూకం లేక చాలా నష్టపోతున్నామన్నారు. కావున పట్టణంలోని పూల కమీషన్ షాపులను సందర్శించి వారి చేతి కాటాలను తొలగించి కమీషన్ షాపుల వారు కంప్యూటర్ కాటాలను ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయాలని తూనికలు, కొలతలు అధికారులకు విన్నవించారు. అనంతరం స్పందించిన తూనికలు, కొలతల అధికారి ఖాజా, డోన్ సిఐ ఇంతియాజ్‌లు కమీషన్ వ్యాపారస్తులను పిలించి, కంప్యూటర్ కాటాలను ఏర్పాటు చేసుకొని, పూలరైతులను మోసం చేయకుండా సరైన తూకాలతో వారికి లాభం వచ్చే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.